# ధర్మయుద్ధం

## -ఎస్. మోహనహరి

''బుస్...న్స్స్...బుస్''

ఆఫ్రికన్ కోబ్రాకి కోపమొచ్చినా, సంతోషమొచ్చినా అదట్లాగే బుసలు కొడుతుంది.

రెండున్నర అడుగుల చతురస్రాకారపు గాజు జాడీలో నుంచి ఆ విష సర్పం రాముని చూసి ఆనందంతో పూర్తిగా పడగవిప్పి బుసకొట్టింది.

ఏర్‌కండిషన్ చేయబడిన ఆ ల్యాబ్‌లో అట్లాగే దాదాపు ఇరవై ఏడు గాజు జాడీలలో మెలికలు తిరుగుతున్న మిగతా నాగుపాములు దానిముందు బలాదూర్ అయిపోతున్నాయి.

రాము కుడి చేతికి ప్రత్యేకమైన గ్లవుజ్ వేసుకుని పాములన్నింటికీ ఆహారం వేస్తూ వస్తున్నాడు.

రెండు చేతులకీ ఖరీదైన, పొడవైన గ్లవుజ్‌లు వేసుకుని తన వెనకాల రంగరాజు వస్తుంటే రాము మనసేమీ బాగాలేదు.

రాము కోబ్రా దగ్గరకొచ్చాడు.

''స్టుపిడ్! మనం చేసే బిజినెస్‌లో ఇలాంటి సెంటిమెంట్స్ పనికిరావు. కమాన్. లీవ్ ఇట్ టు మీ'' అంటూ తన చేతిలోని పెద్ద పింగాణీ పాత్రని రంగరాజు అందుకున్నప్పుడు రాము కళ్లు చెమ్మగిల్లాయి. జాలిగా కోబ్రావైపు చూశాడతను.

కోబ్రా రాము కళ్లల్లో పచార్లు చేస్తున్న భావాలను, ఆవేదనని శబ్ద తరంగాల ద్వారా అర్థం చేసుకున్నట్లుంది. భయంకరంగా మెలికలు తిరుగుతూ వెంటవెంటనే బుసలు కొడుతూ రంగరాజువైపు తిరిగింది.

రంగరాజు మెల్లగా దళసరి పోర్సలిన్ మూతని తొలగించి ఆహారం వేస్తున్నట్లు నటిస్తూ గాజు జాడీలో చేయి పెట్టాడు.

''బుస్!''

కోబ్రా వేసిన కాటుకి రంగరాజు ప్రాణాలను పోగొట్టుకునేవాడు. కానీ అతనేసుకున్న ఖరీదైన గ్లౌజ్ సహాయంతో అతనొక్క క్షణం కూడా వృధా చేయలేదు. కోబ్రా మరోసారి నోరు తెరువకుండా దాని మూతిని గట్టిగా పట్టుకుని బయటకు తీశాడు.

ఆరడుగుల కోబ్రా అతని దేహాన్ని క్షణంలో చుట్టేసుకుంది. తోకతో అతని నడుము చుట్టూ దెబ్బ మీద దెబ్బ కొట్టసాగింది.

రంగరాజు మాత్రం తన పట్టుని విడువలేదు. దాని తలని గట్టిగా పిండుతూ విషాన్ని తీసుకోవాలనే ఆకాంక్ష అతనిలో అధికమైంది. కానీ ఒక్కసారి రామువైపు ఎందుకో తిరిగి చూశాడు.

అదే అతను చేసిన పొరపాటు.

రెప్పపాటు కాలంలో కోబ్రా తన తలని బలంగా విదిలించింది. అతని చేతిలోంచి తప్పించుకుని అదే చేతిని చుట్టేసుకుంది.

''బుస్!''

కోబ్రా బుస కొడుతూ అతని మొహం మీద కాటేయబోయింది.

రాము బిత్తరపోయాడు. అయితే అతను కూడా ఓ క్షణం వృధా చేయలేదు. సరిగ్గా రంగరాజు నుదురుమీద పడుతున్న కోబ్రా కాటుకి అప్రయత్నంగా గ్లౌజ్ ధరించని ఎడమచేతిని అడ్డుపెట్టాడు. అంతే. కోబ్రా వేసిన బలమైన కాటు రాము మణికట్టుపైన పడింది.

చేతికందిన పాము తప్పించుకుని పాలరాతి గచ్చుమీద చరచరా పాక్కుంటూ వెళ్లిపోతుంటే బాధగా మూల్గుతూ రాము మెలికలు తిరుగుతూ నేలమీదికి వొరిగిపోతుంటే భయం, కోపం, చిరాకుతో కాసేపు శిలాప్రతిమలా నిల్చుండిపోయాడు రంగరాజు.

రాము ఏమైనా ఫర్వాలేదు. కానీ తను చేస్తున్న సీక్రెట్ బిజినెస్ ఎక్కడ దెబ్బ తింటుందోనని గుబులు పుట్టుకొచ్చిందతనిలో.

''యూ! బాస్టర్డ్. గెటప్. వెంటనే డాక్టర్ దగ్గరకు వెళ్లాలి'' మొరటుగా అతని చొక్కా పట్టుకుని లేపి భుజం మీదేసుకుని గబగబా బయటకి తీసుకొచ్చి జీపులో పడేశాడతన్ని.

అయితే రంగరాజు జీపు స్టార్టు చేసేలోగా కోబ్రా చటుక్కున వెనుకనున్న స్టెప్నీ మీదకెగిరి చుట్టేసుకున్న సంగతి అతను గమనించలేదు.

రంగరాజు నడుపుతున్న జీపు సరాసరి పూరవతలున్న మర్రిచెట్టు దగ్గరకొచ్చి ఆగిపోయింది.

కోబ్రా మెల్లగా నేలమీదకి జారి పక్కనున్న పొదల వెనకాలకెళ్లి పడగ విప్పి ధ్వని తరంగాలద్వారా తనని గమనిస్తున్నదన్న విషయం కూడా అతను గమనించలేదు. అతను మరో ధ్యాసలో ఉన్నాడు.

''సార్! నన్ను కాపాడండి. పదేళ్ల నుంచీ మిమ్మల్నే నమ్ముకుని బ్రతుకుతున్నాను. నేను చనిపోతే నా తల్లికి దిక్కెవ్వరూ లేరు. దయచేసి నన్ను కాపాడండి'' రాము మెలికలు తిరిగిపోతున్నాడు. అతని నోట్లోంచి తెల్లటి నురగ కారడం మొదలైంది.

రంగురాజు జీపు దిగి సిగరెట్ తీసి వెలిగించాడు.

అతని మొహంలో జాలిలేదు. మౌనంగా రాముని చూస్తూ నిల్చున్నాడు.

రాములో నిస్సత్తువ అంచెలంచెలుగా పెరిగిపోతోంది. ఒకపక్కకి ఒరిగి జీపు మీద్నుంచి దొర్లి నేలమీదకి పడ్డాడు. అట్లాగే అతి కష్టంగా మెల్లగా భూమ్మీద పాక్కుంటూ వచ్చి రంగరాజు పాదాలమీద తల పెట్టేశాడు. కానీ బూటు కాలితో విసురుగా కొట్టిన దెబ్బకి అతను వెల్లకిలా పడిపోయాడు. వెనక్కి మరలిపోతున్న జీపుని చూస్తూ నీరసంగా కళ్లు తేల్చేశాడతను.

కోబ్రా ధ్వని తరంగాలను బాగా ఉపయోగించుకుంటోంది. వేగంగా రాము దగ్గరికి వచ్చి నిల్చుంది. బుస్సుమని బుస కొట్టింది. మూత పడుతున్న కనురెప్పల్ని అతి కష్టంగా విప్పి దానివైపు చూశాడతను.

''ని...ని...నిన్ను ప్రాణంకంటే ఎక్కువగా చూసుకున్నాను. నువ్వయినా నన్నిప్పుడు
కా...పా...డుకో..లే...వా?'' అన్నాడతను.

అతని కన్నీళ్లు కణతల పక్కనుంచి జారుతుంటే కోబ్రా తన నిస్సహాయతని తెలుపుతూ మరోసారి బుస కొట్టింది. మెల్లగా అతని కాళ్ల దగ్గరికి వెళ్లి పడగతో సున్నితంగా అతని పాదాలను స్పృశించింది. అతని చుట్టూ మూడు సార్లు తిరిగింది.

మంచితానికి, మానవత్వానికి మేకులు కొట్టి శిలువ వేస్తున్న సమయమది.

రాము బలంగా గాలి పీల్చుకుని ఒక్కసారి నిశ్వసించాడు.

తిరిగి అతని నాసికాపుటాలకు తాకిన గాలి... ఆగి బాధగా మూలిగి మౌనంగా, స్థబ్దంగా నిలిచిపోయింది.

కోబ్రా పరిస్థితిని పసిగట్టేసింది. పూర్తిగా పడగెత్తి నేలకేసి కొట్టింది బలంగా.

కోబ్రా సమయం వృధా చేయకూడదనుకుంది. చరచరా పాకుతూ మళ్లీ రంగరాజు వున్న ల్యాబ్ దగ్గరకు వచ్చేసింది. గాజు జాడీల మధ్య నిల్చుని చాలా సీరియస్‌గా ఆలోచిస్తున్న అతన్ని చూసి పడగెత్తింది.

''బుస్...!''

రంగరాజు ఉలిక్కిపడ్డాడు. కోబ్రాని చూసి నిలువెల్లా వణికిపోయాడు. అది అతని దగ్గరకు వచ్చి కాటేస్తున్నట్లు



ఫీలయి కంగారుతో ఆ గదిలో నుంచి బయటకి పరుగెత్తాడు.

అతను జీపెక్కి స్టార్ట్ చేసేలోగా కోబ్రా యధావిధిగా స్టెప్నీ మీదెక్కి చుట్ట చుట్టుకుని పడుకుంది.

బూట్లని విప్పకుండా ఫోమ్ బెడ్ మీద వెల్లకిలా పడిపోయి పిచ్చిగా జుట్టు పీక్కున్నాడు. నొప్పితో తల బ్రద్దలైపోతుందేమోనని రెండు చేతులతో బలంగా వత్తుకున్నాడు.

''బుస్...స్స్...బుస్''

రంగరాజు అదిరిపడ్డాడు. చటుక్కున లేచి మంచం మీదికి ఎగిరి కూర్చున్నాడు. భయంతో కూడిన ఆంగ్జైటీతో అతను ఆ గదిలోని ప్రతి అంగుళాన్ని పరీక్షగా చూశాడు.

సరిగ్గా తలుపుచాటున కోబ్రా పడగెత్తి చూస్తోంది.

రంగరాజు స్పైనల్‌కార్డ్‌లోనుంచి వణుకు పుట్టుకొచ్చింది.

మంచంమీదే లేచి నిల్చున్నాడు.

కోబ్రా రంగరాజు వైపు తీక్షణంగా చూస్తోంది.

రంగరాజు దానివైపే చూస్తున్నాడు.

మంచం ప్రక్కనున్న డ్రాయర్ సొరుగు నుండి పిస్తోలు తియ్యాలని ప్రయత్నించాడు. అతని ఆలోచనల్ని కోబ్రా పసిగట్టినట్లుంది. మరికాస్త ఎత్తుగా లేచి పడగని అటూ ఇటూ ఊపసాగింది. కదిల్తే ఎగిరి కాటేస్తుందేమోనని భయంతో మంచం మీదే నిల్చుని గుడ్లప్పగించి చూడసాగాడతను.

''డాడీ! డాడీ''

ప్రణీత గొంతు విని మరింత బెంబేలు పడిపోయాడు. ఒక్కగానొక్క కూతురు. తల్లిలేని బిడ్డ. అప్పుడే స్కూలు నుంచి వస్తోంది. ఆ అమ్మాయి కనుక లోపలికి వస్తే సరిగ్గా అది కాటెయ్యడానికి వీలుగా వుంది.

''ప్రణీ! నువ్వు రావద్దు. వద్దు. అక్కడే వుండు'' గట్టిగా అరుస్తూ చెప్పాలనుకున్నాడు. కానీ అతని నోటి నుంచి మాట రావడంలేదు.

తన కూతుర్ని కాపాడుకోవాలంటే కోబ్రాని కడతేర్చాలి. ఎలా? ఎలా? అతను ఎన్నో విధాలుగా ఆలోచిస్తున్నా అతని మైండ్ మాత్రం సక్రమంగా పని చేయడం మానేసింది.

రంగరాజు బెడ్ మీద్నుంచి కంగారుపడుతూ దిగబోయాడు.

''బుస్...!''

కోబ్రా కళ్లు నిప్పుకణికలై రంగరాజుని గమనిస్తున్నట్లున్నాయి.

అతను బెడ్‌మీద్నుంచి దిగలేకపోతున్నాడు.

ప్రణీత లోపలికి వచ్చేస్తుంది.

జున్ను ముక్కలాంటి ఆ లేత శరీరం మీద కోబ్రా కాటేస్తున్నట్లుగా ఊహించుకున్న అతను భయంతో ''ప్రణీ! వద్దు. లోపలికి రావద్దు. వెళ్లిపో'' అని బిగ్గరగా కేకవేశాడు. గట్టిగా కళ్లు మూసుకున్నాడు.

ప్రణీత పకపకా నవ్వుతోంది. అతను ఆశ్చర్యంగా కళ్లు తెరిచి చూశాడు. బట్టలు మార్చుకోకుండా బూట్లతోసహా మంచంమీద నిల్చున్న తీరుని చూసి బుగ్గలు నొక్కుకుంటున్న ప్రణీతని అమాంతంగా ఎత్తుకుని గుండెలకి హత్తుకున్నాడు పిచ్చిగా. తల్లిలేని ఆ పిల్ల బుగ్గలమీద ముద్దుల వర్షం కురిపించాడు.

అప్పుడు గుర్తొచ్చిందతనికి-కోబ్రా!

అదురుతున్న గుండెతో నలువైపులా చూశాడు. కిటికీ

కర్టెన్ దగ్గర బయటకి జారిపోతున్న కోబ్రా తాలూకు తోకని గమనించి రవ్వంత ధైర్యం తెచ్చుకుని నిట్టూర్పు విడిచాడు.

రంగరాజు పిస్తోలు తీసి జేబులో వేసు కున్నాడు. కోబ్రా తనని నీడలా వెంటాడు తున్నందుకు అతని మనసు పాడైపో యింది. తనింట్లో వుంటే అది మళ్లీ వస్తుం దనే అనుమానం, నమ్మకం ఏర్పడిపోయిం దతనిలో.

కోబ్రా బ్రతక్కూడదు. దాన్ని ఎలాగైనా ట్రాప్‌చేసి చంపాలి. ఎట్లా? ఎట్లా? ఎట్లా?

అతనికి పాముల నర్సయ్య గుర్తుకొ చ్చాడు. ఊరవతల ఓ చిన్నపల్లెలో వుంటా డతను. అతని మాటెత్తితే ఎలాంటి పామైనా కదలకుండా నిలిచిపోతుందని అందరూ చెప్పుకుంటారు. అతని సహాయంతో దాన్ని కదలకండా చేయాలి. దాని పడ గలో పిస్తోలు తూటాలని దూర్చి పారేయాలి.

రంగరాజు ప్రణీతని ఆయాకి అప్పగించి జీపుదగ్గరకు పరుగెత్తాడు.

మధ్యదారిలో కాస్తంత మనశ్శాంతికోసం వో బ్రాందీ షాపు దగ్గర జీపు ఆపాడు. విస్కీబాటిల్ విప్పి ఏకంగా లాగించేశాడు. ఎడంచేత్తో స్టీరింగ్‌ని బలంగా పట్టుకు న్నాడు.

మరో బాటిల్ తెప్పించుకుని రోడ్డుమీదే త్రాగేశాడు. అయినా అతనికి కావాల్సిన ప్రశాంతత కలగడంలేదు.

ఎన్నో ఏళ్ల నుంచి విషసర్పాల విషంతో వాటి చర్మాలతో రహస్య వ్యాపారం చేస్తూ లక్షలు సంపాదించాడు. ఇప్పుడు ఆ పాము విషానికే భయపడి పిచ్చివాడిలా అయిపోతు న్నాడు.

బుస్!

రంగరాజు మళ్లీ బెదిరిపోయాడు.

అటూ ఇటూ చూశాడు. కోబ్రా కని పించలేదు.

మరో విస్కీబాటిల్ తెప్పించుకుని త్రాగాడు.

''బుస్...స్‌స్‌స్...''

మళ్లీ బుస కొట్టినట్టు వినిపించింది. అతనికి పిచ్చి పట్టినట్లయింది. చకచకా గేరు మార్చి జీపుని ముందుకు పరుగెత్తిం చాడు.


మళ్లీ అక్కడే...అక్కడే అతను చేస్తున్న తప్పు.

తనకంటే కోబ్రా చాలా తెలివైనదని తనకంటే ముందుగా తనకి తెలీకుండానే అది జీపు వెనకాల సీటులో చుట్ట చుట్టు కుని ఉందన్న సంగతి అతనికి తెలీదు.

జీపు సిటీ ఏరియా దాటి సరిగ్గా మర్రి చెట్టు దగ్గరికి రాగానే కోబ్రా మరోసారి భయంకరంగా బుసకొట్టింది.

రంగరాజు గుండె ఝల్లుమంది.

సడెన్‌గా బ్రేక్ వేశాడు.




''బుస్...బుస్...''

కోబ్రా కోపంతో రెచ్చిపోయింది. బలంగా సీటు మీద నుంచి పడగ ఎత్తింది. రంగరాజు వెనక్కి తిరిగి చూశాడు. పడగెత్తి బుసలు కొడుతున్న కోబ్రాని చూసి ఉన్మాదుడై పోయాడు. చటుక్కున జీపు దిగి పరుగెత్తాడు.

కోబ్రా అంతకంటే వేగంగా ముందుకెళ్లి అతనికి ఎదు రుగా పడగవిప్పి వూగసాగింది.

ఆ స్థలం రాము ప్రాణాలు విడిచిన స్థలం.

ఆ స్థలం రాము శవం పడివున్న శవం.

రంగరాజు నిల్చుండిపోయాడు. ఇప్పుడు అతని మన సులో భయంలేదు. తెగింపు వచ్చేసింది.

కోబ్రావైపు చూశాడు.

మసక వెన్నెల వెలుతురు.

''యూ డెవిల్. నిన్నిక వదిలిపెట్టను. నువ్వయినా బ్రతకాలి, నేనైనా బ్రతకాలి. కమాన్. కమాన్ ఐసే'' కోబ్రా వైపు పిస్తోలు గురి పెట్టాడతను.

కోబ్రా దాదాపు తోకమీద నిల్చున్నట్లుగా నిటారుగా లేచి పూర్తిగా పడగవిప్పింది. నిశ్శబ్దంలో శబ్దం దాని బుసలు ఆ ప్రాంతంలో స్పష్టంగా వినిపిస్తున్నాయి.

రంగరాజు ట్రిగర్ నొక్కాడు.

అంతకంటే ముందే కోబ్రా గాలిలోకి లేచింది. సూటిగా అతని నుదుటిమీద కాటేసింది.

''అబ్బా'' రంగరాజు నేలమీదకి ఒరి గిపోయాడు.

కోబ్రా అక్కడే వుంది.

అతను గిలగిలా తన్నుకుంటూ ప్రాణాలు విడుస్తుంటే తృప్తిగా చూడాలన్న ట్లుగా దాని బుసలు ఆ నిశ్శబ్దపు వాతావర ణంలో ప్రతిధ్వనిస్తున్నాయి.

''న్నే... నిన్ను వదిలిపెట్టను. ఐ వోంట్ లీవ్ యూ'' రంగరాజు మరోసారి ట్రిగర్ నొక్కబోయాడు.

''బుస్...''

కోబ్రా మరోసారి అతని ఎడం చేతిమీద కాటేసింది.

అతను బాధతో మెలికలు తిరిగిపోయాడు. 'కానీ అత నిలో ప్రతీకార వాంఛ ప్రజ్వరిల్లుతోంది.

ఒక విష ప్రాణి ఒక మనిషితో మంచి కోసం పోరాడు తోంది.

ఒక మనిషి మనసు నిండా విషపూరిత ఆలోచనలతో ఒక విషప్రాణితో అధర్మ పోరాటం జరుపుతున్నాడు.

యుద్ధం!

మంచీచెడుల మధ్య యుద్ధం జరుగుతోంది.

రంగరాజు కళ్లల్లో మసక తెరలు తెరలుగా కమ్ముకుం టున్నాయి.

మసక వెన్నెల మరింత మసకబారుతోంది.

ఒంట్లో నుంచి జారిపోతున్న సత్తువని అతికష్టంగా మళ్లీ తెచ్చుకుంటూ కోబ్రావైపు గురి పెట్టి కాల్చాడు.

బుస్...ధన్!

రెండు శబ్దాలు ఒకేసారి వినిపించాయి.

యుద్ధం ముగిసింది.

రంగరాజు పేల్చిన పిస్తోలు తూటా కోబ్రా పగడలోంచి దూసుకుపోయింది.


కోబ్రా పడగ మరోసారి కాటెయ్యక అతని గొంతు మీద పడిపోయింది. దాని బరువుకి తట్టుకోలేక రంగరాజు వెల్లకిలా పడిపో యాడు.

రంగరాజు క్రింద, కోబ్రాపైన. దాని పడగ మాత్రం రాము పాదాల దగ్గర పడిపో యింది.

యుద్ధంలో ఇద్దరూ గెలిచారు. ఇద్దరూ ఓడిపోయారు.

ఒక విషప్రాణి ధర్మయుద్ధంలో ప్రాణం వదిలినందుకు గాలి మెల్లమెల్లగా వణు కుతూ వీస్తోంది. అది చూడలేక చంద్రుడు మబ్బుల మాటున వెళ్లిపోయాడు. ★

## మళ్లీ కలుస్తారా?



నేటి తరం ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న సంగీత దర్శకుల జంట 'రాజ్-కోటి'. దాదాపు పదేళ్లు సంయు క్తంగా అనేక సక్సెస్‌ఫుల్ చిత్రాలకు సంగీతాన్ని సమకూర్చిన ఈ జంట ఏవో కారణాల వల్ల విడిపోయింది. ఇద్దరిలో ఇప్పుడు 'కోటి' మంచి బిజీగా వున్నాడు. రాజ్ కూడా అడపాదడపా చిత్రాలకు సంగీతాన్ని సమకూరుస్తూనే వున్నాడు. ఒకప్పుడు కృష్ణ-బాలుల మధ్య గొడవని సమసిపోయేలా చేసి ఇద్దరికీ సయోధ్య కుదిర్చిన వాళ్లలో అప్పట్లో రాజ్-కోటిల పేరు బాగా వినిపించింది. అలాంటిది వీళ్లిద్దరే విడిపోవడం అందరికీ బాధ కలిగించే విషయమే. అయితే ఇప్పుడీ ఇద్దరూ తిరిగి కలిసి పనిచేయాలనుకుంటున్నారనే విషయం చూచాయగా సినీ వర్గాల్లో వినిపిస్తోంది. అదే నిజమైతే అంతకన్నా శుభం మరొకటేముంది?

- జె.ఎం.